సాక్షి
పెద్దపల్లి

మంగళవారం : 4 : జులై : 2023



ఆది దేవుడికి వందనం

వేములవాడ: రాజన్నను సోమవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



పత్తి క్వింటాల్‌కు రూ.6,426

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌యార్డులో సోమవారం పత్తి క్వింటాల్‌కు రూ.6,426, కనిష్ట ధర రూ.5,926, సరాసరి ధర రూ.6,300 నమోదైందని ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బెస్ట్ అవేలబుల్ స్కూల్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

పెద్దపల్లిరూరల్: బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ నందు 1వ, 5వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో గల బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో 1వ తరగతిలో 70 సీట్లు (నాన్ రెసిడెన్షియల్), 5వ తరగతిలో 73 సీట్లు (రెసిడెన్షియల్) కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలోని గ్రామీణస్థాయి వారు రూ.1.50 లక్షలు, పట్టణస్థాయి వారికి రూ.2 లక్షల లోపు వార్షిక ఆదాయం కలిగి ఉండాలన్నారు. ఒకటవ తరగతిలో చేరే విద్యార్థులు 2017 జూన్ 1 నుంచి 2018 మే 31 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. విద్యార్థులను లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని, పూర్తి వివరాలకు 90101 36407, 99082 61045 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫ్యాకల్టీల కోసం..

గోదావరిఖని(రామగుండం): వృత్తి విద్యా కోర్సులు నేర్పించేందుకు ఫ్యాకల్టీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్జీ–2 అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ తెలిపారు. టైలరింగ్, మగ్గంవర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులు నేర్పించుటకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సు సర్టిఫికెట్స్, అనుభవం, విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్‌ఫొటో జత చేసి ఈనెల 15లోగా జీఎం కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

నేడు సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లిరూరల్: దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం మంగళవారం మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వి.శ్రీధర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు, తాత్కాలిక సదరం సర్టిఫికెట్ ఉన్నవారు రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. శారీరక వైకల్యం కోసం ఈనెల 6, 20 తేదీల్లో నిర్వహించే క్యాంప్ స్లాట్ల కోసం బుక్‌చేసుకోవాలన్నారు. దృష్టి లోపం ఉన్నవారు 13న, మానసిక అంగవైకల్యం, బుద్ధిమాన్యం ఉన్నవారు 17న, వినికిడి లోపం గలవారు 27న స్లాట్ నమోదుకు బుక్‌చేసుకోవాలన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు మెడికల్ క్యాంపులకు వచ్చేటపుడు దరఖాస్తుదారు దివ్యాంగుల రశీదుతో పాటు వికలాంగ పరీక్షా కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్ట్‌లను తీసుకొని రావాలని పేర్కొన్నారు.

ఎత్తిపోశారు.. నిలిపివేశారు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నందిమేడారం నంది పంప్‌హౌజ్‌లోని రెండు మోటార్ల ద్వారా సోమవారం కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని రిజర్వాయర్‌లోకి ఎత్తిపోశారు. ఉదయం 2 రెండు పంప్‌ల ద్వారా నీటిని ఎత్తిపోసి మధ్యాహ్నం ఒక పంప్‌ను నిలిపివేశారు. అలాగే రిజర్వాయర్ నుంచి 3,150 క్యూసెక్కుల నీటిని రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌజ్‌కు టన్నెల్ ద్వారా తరలించారు. కాగా సాయంత్రం రెండు మోటార్లను నిలిపివేశారు. మంగళవారం ఉదయం రెండు పంపుల ద్వారా మేడారం రిజర్వాయర్‌లోకి నీటిని తరలించనున్నట్లు ప్రాజెక్టు ఇంజినీర్ పేర్కొన్నారు.

పరిహారం చెల్లించాలని ఆందోళన



వాటర్ ట్యాంక్‌పై గ్రామస్తులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): పరిహారం చెల్లించాలని రామగిరి మండలం చందనాపూర్ ఎస్సీ కాలనీవాసులు సోమవారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. ఓసీపీ విస్తరణలో భాగంగా సింగరేణి యాజమాన్యం తమ గ్రామాన్ని తీసుకొని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మాత్రమే చెల్లించి, పరిహారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. తమకు అందాల్సిన పూర్తి నష్టపరిహారం, పునరావాసం కల్పించకుండానే ఇళ్లను ఖాళీ చేయాలంటూ సింగరేణి అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ఎస్సీ కాలనీవాసులు ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు. పూర్తి పరిహారం అందిన తర్వాతే గ్రామాన్ని వదిలి వెళ్తామని, తమ గ్రామానికి తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

సమస్యల వాణి

- ప్రజా విజ్ఞప్తులకు కానరాని పరిష్కారం
- ఎక్కువ భాగం రెవెన్యూ సమస్యలే
- కలెక్టరేట్‌కు ప్రదక్షిణలు చేస్తూ విసిగిపోతున్న ప్రజలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

సాక్షి, పెద్దపల్లి: నీ సమస్య ఏంటి? ఏమైంది..? ఎక్కడ నుంచి వచ్చావు? ఇలాంటి పలకరింపులు ఉన్నాతాధికారుల నుంచి వచ్చే మాటలు. సమస్యలతో వచ్చిన వారికి కొండంత ఆసరా, స్వాంతన. తమ సమస్యను వినే అధికారి దొరికాడనే ధీమా కలుగుతుంది. కాగా ఉన్నాతాధికారులు అందుబాటులో ఉండే కలెక్టర్ కార్యాలయానికి వస్తే సమస్యలు పరిష్కారానికి నోచుకోక అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రాల్లో అధికారులు పట్టించుకోకపోవడంతో బాధితులు జిల్లా కలెక్టర్ దృష్టికైనా తీసుకెళ్తే తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వస్తున్నారు. కాగా జిల్లా కేంద్రంలో అర్జీ ఇస్తే తిరిగి అది మండల కేంద్రానికి వెళ్తుండడంతో ఏళ్లుగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

రెవెన్యూ విభాగానివే అధికం

ఒక రైతు మరొకరి నుంచి భూమి కొనుగోలు చేసినా, పేరు మార్పిడి, కుటుంబ పెద్ద చనిపోతే వారసులకు భూమి బదాలయించడంలో అలసత్వం, పట్టాభూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నా వాటిని సరిచేయడంలో నిర్లక్ష్యం వెరసి భూసమస్యలతో ప్రజావాణికి అర్జీలు పోటెత్తుతున్నాయి. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో అధికంగా రెవెన్యూ సమస్యలు తరువాత ఫించన్లు కోసం మిగతావి వ్యక్తిగత సమస్యలపై వస్తున్నాయి. సోమవారం ప్రజావాణికి మొత్తం 72 అర్జీలు రాగా అందులో రెవెన్యూ సంబంధించినవే 39 ఫిర్యాదులున్నాయి. మిగతా 33 అర్జీలు వివిధ శాఖలకు చెందినవి ఉన్నాయి. అంటే వచ్చే ఫిర్యాదుల్లో 50శాతానికి పైగా ధరణికి సంబంధించిన సమస్యలే.

భూమి నాపేరున కావడం లేదు



మాకు ఐదు ఎకరాల వ్యవసాయభూమి ఉంది. నా భర్త మరణించగా ఆ భూమి నాపేరున పట్టా కావడం లేదు. అధికారులను అడిగితే ఆధార్‌లో పేరు తప్పుగా నమోదు అయ్యిందని చెబుతున్నారు. ఆధార్ అప్‌డేట్ చేసినా భూమి నాపేరున మార్చడం లేదు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే రైతుబంధు, తదితర పథకాలు అందడం లేదు.

– జల్లి దుర్గమ్మ, ముప్పరితోట, ఎలిగేడు

పదిసార్లు వచ్చా



నాకు, మా తమ్ముడికి కలిపి 7ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో 25గుంటల భూమి కాలువ కెనాల్లో పోయినట్లు రికార్డుల్లో చూపుతుంది. మోకా మీద మేం వ్యవసాయం చేసుకుంటున్నా ఆ భూమి మాత్రం పట్టాలోకి ఎక్కలేదు. దీంతో రైతుబంధుతో పాటు బ్యాంకులో రుణం తీసుకోలేకపోతున్నా. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజావాణికి 10సార్లు వచ్చి ఫిర్యాదు చేసినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.

– ఇందారపు రాజేశం, పెద్దకాల్వల

పైపులు తీయించాలి



పెద్దపల్లిలోని హన్మంతునిపేట గ్రామ శివారులో 2ఆర్/1ఆర్ కెనాల్ ద్వారా సుమారు 100 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇటీవల కెనాల్ లోపల పైపులు వేయడం ద్వారా పంట పొలాలకు నీరందక రైతులు ఇబ్బందిపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి. కెనాల్‌లోపల పైపులు తీయించి నీరు అందేలా చూడాలి.


– మేకల కుమార్, హన్మంతునిపేట

అక్రమ నిర్మాణాలు ఆపాలి



మేమంతా అంతర్గాంలో మూతపడిన స్పిన్నింగ్ మిల్లులో పనిచేసిన కార్మిక కుటుంబాలకు చెందినవారం. మా పూర్వీకులు మిల్లులో పనిచేసి తీవ్రంగా నష్టపోయారు. మిల్లు మూతపడటంతో కడుపు చేతబట్టుకొని పస్తులు ఉంటూ పరాయి ఊర్లకు వలస వెళ్లాం. అప్పుడు మాకు ఇచ్చిన ప్లాట్స్‌లలో ఇండ్లు నిర్మించుకుందామంటే అనుమతులు ఇవ్వడం లేదు. కానీ మా కుటుంబాలకు సంబంధంలేని వ్యక్తులు వచ్చి అక్రమంగా మా ప్లాట్స్‌లలో ఇండ్లు నిర్మించుకుంటున్నారు. మేము ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకునేవారు లేరు. అక్రమ కట్టడాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నాడు మిల్లు మూతపడి మా కుటుంబాలు ఆగం అయ్యాయి. ఈరోజు కూడా అన్యాయమే జరుగుతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి మాకు న్యాయం చేయాలి.

– అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు కార్మికుల కుటుంబసభ్యులు



జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	విద్యార్థులు
కరీంనగర్	623	2,787	36,775
జగిత్యాల	748	3,915	65,632
పెద్దపల్లి	580	2,423	45,626
సిరిసిల్ల	510	2,651	37,803

డుమ్మా మాస్టార్లు!

- ఉమ్మడి జిల్లాలో సరిగా అమలుకాని బయోమెట్రిక్
- సమయపాలనకు మంగళం
- బడికి రాకపోయినా ఆన్‌డ్యూటీలుగా నమోదు
- సీఆర్‌పీలు, ఇన్‌చార్జి ఎంఈవోలు సైతం ఇదే బాటలో

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయుల హాజరు కోసం ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావడంలేదు. ఇటీవల కరీంనగర్ డీఈవో చొప్పదండికి తనిఖీకి వెళ్లినపుడు ముగ్గురు టీచర్లు ఆలస్యంగా రావడంతో వారిని సీఎల్ పెట్టుకోమని ఆదేశించారు. మరోవైపు జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలోనూ ఇదే తరహా పరిస్థితి ఉంది. ఈవ్యవహారంపై కొందరు సమాచార హక్కుద్వారా జగిత్యాల విద్యాశాఖ నుంచి వివరాలు కోరినప్పుడు గురువుల డుమ్మాల బాగోతం బయటపడింది. బడికిరాకున్నా.. వచ్చినట్లు అటెండెన్స్ వేసుకునే మాష్టార్ల నిర్వాకం వెలుగుచూసింది. ఎవరి అనుమతి తీసుకోకుండా మాష్టార్లు రోజుల తరబడి బడికి రాకపోవడం.. సమయపాలన పాటించకపోవడం తదితరాలన్నీ స్పష్టంగా తెలిశాయి.

నిర్వహణ అంతంతే..

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో కేవలం 14 జిల్లాల్లో మాత్రమే బయోమెట్రిక్ అమలవుతుంది. ఉమ్మడి జిల్లాలో బయోమెట్రిక్ నిర్వహణ ఓ ఏజెన్సీకి అప్పగించారు. పొరపాటున ఏదైనా స్కూల్లో బయోమెట్రిక్ యంత్రం మొరాయించినా.. సాంకేతిక సమస్యలు తలెత్తినా దాన్ని వెంటనే రిపేరు చేయడం లేదు. సదరు ఏజెన్సీ నిర్వాహకులు ఫిర్యాదు చేసినా వారం లేదా రెండు వారాల తర్వాత వచ్చి బాగు చేస్తున్నారు. ఇదే అదనుగా పలువురు ఉపాధ్యాయులు ఏకంగా పాఠశాలకు డుమ్మాలు కొట్టేస్తున్నారు. సాధారణ ఉపాధ్యాయులతో పాటు ఇన్‌చార్జి ఎంఈవోలు కూడా ఇదే బాటలో పయనిస్తున్నారు. కొందరు ఇన్‌చార్జి ఎంఈవోలు ఏకంగా 15 రోజుల పాటు ఆన్‌డ్యూటీలు పెట్టుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నిరంతరం స్కూలుకు ఆలస్యంగా వస్తూ.. డుమ్మాలు కొడుతూ ఆన్‌డ్యూటీలు వేసుకుంటున్న టీచర్లపై విద్యార్థుల తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. బడికి రాకున్నా.. దొడ్డిదారిలో హాజరు వేసుకుని, జీతం తీసుకోవడం ఎక్కడి నైతికత అని విమర్శిస్తున్నారు.

ఏం జరుగుతోంది?

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైమరీ స్కూళ్లు ఉదయం 9 నుంచి 4 గంటలు, హైస్కూలు 9.30 నుంచి 4.45 గంటల వరకు ఉపాధ్యాయులు పాఠశాలల్లో ఉండాలి. కొందరు గురువులు ఈ సమయపాలన పాటించడం లేదు. చాలామంది గంట లేదా రెండు గంటలు ఆలస్యంగా రావడం, లేదా గంట..గంటన్నర ముందుగానే వెళ్లిపోవడం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ విద్యా సంబంధిత కార్యక్రమాల అమలుకోసం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)లను నియమిస్తారు. ఈపనుల మీద వివిధ స్కూళ్లకు వెళ్లాల్సి వస్తోంది. కానీ.. పనులు లేనప్పుడు కూడా సీఆర్‌పీలు హాజరు కావడంలేదు. వీరు ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహించే సమయంలో ఆన్‌డ్యూటీ (ఓడీ)లుగా నమోదు చేస్తున్నారు. సీఆర్‌పీలతోపాటు కొందరు ఉపాధ్యాయులు కూడా పలుచోట్ల ఓడీలుగా నమోదు చేసుకుంటున్నారు. ఎలాంటి అదనపు విధులు లేని ఉపాధ్యాయులు కూడా ఓడీలు ఎందుకు పెట్టుకుంటున్నారో వారికే తెలియాలని తోటి టీచర్లు వాపోతున్నారు. ఆలస్యంగా వచ్చినా.. ముందుగా వెళ్లినా వీరెవరికీ వేతనాల్లో ఎలాంటి కోతలు విధించడం లేదు. గతేడాది మధ్యలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరచుగా ఆలస్యంగా వచ్చే పలువురు ఉపాధ్యాయులకు మెమోలతో సరిపెట్టారు. ఆ తర్వాత వీరెవరిపైనా ఎలాంటి పర్యవేక్షణ లేదు. దీంతో చాలామంది టీచర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ సంగీత సత్యనారాయణ

పెద్దపల్లిరూరల్: వానాకాలంలో సీజనల్ వ్యాధుల కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీతసత్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్‌లతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఆదివారం విద్యా సంస్థల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలలో చదివే పిల్లల ఆరోగ్యస్థితిగతులపై పర్యవేక్షణ ఉండాలన్నారు. రోజూ పిల్లల ఆరోగ్యంపై వార్డెన్‌లు నివేదిక సమర్పించాలని సూచించారు.

ఆగస్టు 5 వరకు ఆవిష్కరణలు పంపాలి

ఇంటింటా ఇన్నోవేటర్ లో పాల్గొనేందుకు ఆగస్టు 5లోగా వివరాలు పంపాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ అన్నారు. ఇంటింటా ఇన్నోవేటర్ 2023 సంవత్సరానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. తమ ఆవిష్కరణకు సంబంధించిన వివరాలను సెల్ నంబర్ 91006 78543 కు వాట్సాప్ చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, జిల్లా మలేరియా అధికారి రాజమౌళి తదితరులున్నారు.

ఎంపిక పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో కవిత

ఎలిగేడు(పెద్దపల్లి): స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం ఎంపిక పోటీలను ఎంఈవో కవిత ప్రారంభించారు. బి.అర్జున్ (ఎంపీపీఎస్, రాముపల్లి), కె.రక్షిత (ఎంపీ యూపీఎస్, నర్సాపూర్), కె.అక్షయ (ఎంపీపీఎస్, ఎలిగేడు) జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. హెచ్‌ఎం జీవన్‌రెడ్డి, పీఈటీలు శ్రీనివాస్, రాజేందర్, వెంకటేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.







వైభవంగా గురుపూర్ణిమ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణిమ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పట్టణంలో బాబా శోభాయాత్ర నిర్వహించారు. అలాగే రైల్వేస్టేషన్ రోడ్డులోగల హనుమాన్ ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

ఆలయ భూములను స్వాధీనం చేసుకోవాలి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి భూకబ్జాలకు, సహజవనరుల దోపిడీకి పాల్పడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, ప్రజాహిత వ్యవస్థాపకుడు సి.సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎల్.రాజయ్యలు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సంగీతకు ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి మండలం కాసులపల్లిలో ఆలయ భూమిని ఆక్రమించి అందులో విద్యాసంస్థల భవనాలను అక్రమంగా నిర్మించాడని, వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. పెద్దపల్లిలోని ఎల్లమ్మ, గుండమ్మ చెరువుల్లో మట్టిని అమ్ముకోవడంతో పాటు మినీ ట్యాంకుబండ్ పేరిట నిధులను స్వాహా చేస్తున్నాడని ఆరోపించారు. గత ఎన్నికల అఫిడవిట్‌లో ఆలయ భూములను తన ఆస్తిగా పేర్కొన్న ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించాలన్నారు.

విజిలెన్స్ ఎఫెక్ట్.. సెలవుల్లో కమిషనర్!

- పది రోజులుగా లీవ్‌లో మరో ఇంజినీర్
- వేతనాల కోసం ఉద్యోగుల ఎదురుచూపు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులు వరుసగా సెలవులు పెడుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు విజిలెన్స్ అధికారుల విచారణ, మరోవైపు బిల్లుల కోసం కాంట్రాక్టర్లు, ఇంకోవైపు కొత్తగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు పెరుగుతుండడంతో అధికారులు బదిలీలు, సెలవులవైపు దృష్టిమళ్లిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో 10 రోజులుగా ఇంజినీరింగ్ విభాగంలోని ఓ అధికారి సెలవులోకి వెళ్లగా, తాజాగా మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు కూడా ఈనెల 14 వరకు సెలవు పెట్టారు. తనకు ఆరోగ్యం బాగాలేదని, వైద్యుల సూచనల మేరకు సెలవు పెడుతున్నట్లు పేర్కొన్నారు. కాగా మరో అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకపోవడంతో బల్దియా పాలన అయోమయ పరిస్థితులకు దారితీస్తోంది. బల్దియాలో ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని మేయర్ బి.అనిల్‌కుమార్ జిల్లా ఉన్నతాధికారులను కోరినట్లు తెలిసింది.

విజిలెన్స్ విచారణతో..

నగరపాలక సంస్థలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ విభాగం అధికారులు వరుసగా విచారణ చేపడుతుండడంతో బల్దియా అధికారులు భయంతో వణికిపోతున్నారు. ఇప్పటికే శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, వాహనాల కొనుగోలుపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టగా, తాజాగా ఎస్సీ సబ్‌ప్లాన్, 14వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి ద్వారా చేపట్టిన మరో 14 అభివృద్ధి పనులపై వచ్చిన ఫిర్యాదులపై వివరాలు కావాలంటూ విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. విజిలెన్స్ విచారణకు హాజరవుతున్న ఓ అధికారి సెలవులోకి వెళ్లారని తెలిసింది. మరో ఇద్దరు అధికారులు కూడా వ్యక్తిగత కారణాలతో సెలవు పెట్టారని తెలుస్తోంది. ఉన్న అధికారుల్లోని మరికొందరు కూడా విజిలెన్స్ విచారణ తలనొప్పుల నుంచి తప్పించుకోవడానికి సెలవు పెట్టే ఆలోచనలు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

వేతనాల కోసం 572 మంది ఉద్యోగులు..

బల్దియా కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 572 మంది ఉద్యోగులకు సోమవారం వరకు వేతనాలు అందలేదు. మున్సిపల్ కమిషనర్ వేతనాలకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేస్తేనే అందరికీ నెల జీతం అందనుంది. ఈనెల 2 నుంచి 14 వరకు కమిషనర్ సెలవు పెట్టారు. చెక్ పవర్ మరో అధికారికి లేకపోవడంతో ఉద్యోగుల వేతనాల మంజూరు ప్రక్రియ అయోమయానికి దారితీస్తోంది. కమిషనర్ 13 రోజుల వరకు సెలవు పెట్టడం, మరో అధికారికి ఎఫ్ఏసీ ఇవ్వకపోడం, కమిషనర్‌కు మాత్రమే చెక్ పవర్ ఉండడంతో బల్దియాలోని పలు కీలక సేవలు స్తంభించనున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, ట్రేడ్‌లైసెన్స్‌ల మంజూరు తదితర వాటిపై ప్రభావం పడనుంది.



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బిల్లుల కోసం కాంట్రాక్టర్లు..

ఒకవైపు చేసిన పనుల బిల్లుల కోసం పలువురు కాంట్రాక్టర్లు, మరోవైపు డివిజన్లలో కొత్త అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు చేస్తున్నారు. కాంట్రాక్టర్లు బల్దియా ముందు బైఠాయించి ఆందోళన కూడా చేశారు. ఇదిలా ఉంటే నచ్చిన విధంగా ఫైళ్లు రాయాలని అధికారులపై కొందరు కాంట్రాక్టర్లు బెదిరింపులకు గురి చేస్తున్నారని, పరిమితికి మించి రికార్డులు నమోదు చెయ్యాలని ఒత్తిడి చేస్తుండడంతో అధికారులు ఒత్తిడికి గురవుతున్నారని తెలుస్తోంది. మరోవైపు ఏసీబీ అధికారులకు పట్టిస్తామని బెదిరింపులకు గురి చేస్తుండంతోనే ఒత్తిళ్లతో సెలవులోకి వెళ్తున్నారని ప్రచారం జరుగుతోంది.

క్లుప్తంగా

'ప్రైవేట్ స్కూల్‌పై చర్య తీసుకోవాలి'

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేయడంతో తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్ల కార్డులతో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులకు సంబంధించిన టీసీలు, మెమోలు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులను మానసిక వేదనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలలో పని చేస్తున్న ఓ వ్యక్తి బెదిరింపులకు గురిచేస్తున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో విద్యార్థిని తల్లి కళ్యాణి, ఏబీవీపీ నాయకుడు సిద్దూ, పీడీఎస్‌యూ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): ఒడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని ఒడ్డెర సంఘం జిల్లా వైస్ చైర్మన్ పోశెట్టి, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ సోమవారం కలెక్టర్ డాక్టర్ సంగీతకు వినతిపత్రం అందజేశారు. సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు కోట సురేందర్, నాయకులు సమ్మయ్య, రాజు, మల్లేష్, శేఖర్, గణేష్, నితిన్, తిరుపతి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం ఇద్దరికి గాయాలయ్యాయి. పెద్దపల్లి నుంచి రామకృష్ణాపూర్‌కు వెళ్తున్న ఆటోను లారీ వెనుక నుంచి ఢీకొంది. ఆటోలో ఉన్న మతీనా బేగం, నస్రీన్‌కు గాయాలయ్యాయి. అక్బర్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షాదీ డాట్ కామ్‌లో పరిచయమైన కి'లేడీ'

- పెళ్లయిన రెండు నెలలకు డబ్బు, బంగారంతో పరార్
- పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన పాన్‌షాప్ నిర్వాహకుడు వరంగల్ జిల్లాకు చెందిన ఓ యువతి మాయలో పడి మోసపోయాడు. అప్పటికే మూడు పెళ్లిల్లు చేసుకున్న మాయ లేడీ ఇక్కడి యువకున్ని మోసం చేసి డబ్బు, బంగారంతో పరారైంది. దీంతో బాధితుడు ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాలు.. ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన రేవంత్‌కు అప్పటికే పెళ్లి జరిగి విడాకులయ్యాయి. అయితే ఓ షాదీ డాట్ కామ్ ద్వారా యువతి పరిచయమైంది. ఆ పరిచయం సెల్ ఫోన్లలో ముచ్చట్లు.. తర్వాత పెళ్లి వరకు వచ్చింది. ఇదే మొదటి పెళ్లి అంటూ సదరు యువతి నమ్మించింది. దీంతో రెండు కుటుంబాలకు చెందిన పెద్దలు పెళ్లి కుదిర్చారు. వెంటనే ఎన్టీపీసీలోని చిలుకలయ్య ఆలయంలో సాదాసీదాగా వివాహం చేసుకుని కొత్త కాపురం ప్రారంభించారు. ఇక లేడీ తన



రేవంత్ పెండ్లి ఫొటో

కిలాడీల ప్రదర్శన ప్రారంభించింది. తనకు మందు, సిగరేట్లు కావాలంటూ యువకున్ని నిత్యం వేధింపులకు గురిచేసింది. ఇద్దరి మధ్య గొడవలు మొదలై రెండు నెలలు గడిచాయి. ఈక్రమంలో యువతి తన అక్క వద్దకు వెళ్తున్నానని ఇంట్లో ఉన్న రూ.70వేల నగదు, 4 తులాల బంగారు ఆభరణాలతో బిచానా ఎత్తేసింది. రోజులు గడుస్తున్నా తిరిగి రాకపోవడంతో యువకుడు ఆమె బంధువులు, మిత్రుల వద్ద ఆరా తీయడంతో అసలు విషయాలు బయటపడ్డాయి. అప్పటికే మూడు పెళ్లిలు అయ్యాయని, చాలా మందితో పరిచయాలు ఉన్నాయని తెలుసుకున్నాడు. చివరకు చిరునామా తెలుసుకుని వెళ్లడంతో సదరు యువతి తన మిత్రులతో విందు విలాసాలతో కనిపించింది. ఏకంగా వారందరూ పాన్‌షాప్ యువకుడిపై దాడి చేసి, వాటిని వీడియో తీశారు. ఈ వీడియోలు సదరు యువతి మిత్రులు సోషల్ మీడియాలో పెడతామంటూ బెదిరింపులకు గురిచేశారు. అంతేగాకుండా యువకుడి కుటుంబసభ్యులను సైతం డబ్బుల కోసం డిమాండ్ చేశారు. దీంతో యువకుడు ఎన్టీపీసీ పోలీసులను ఆశ్రయించి గోడు వెళ్లబోసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

న్యాయం చేయండి..



పెండ్లి పేరుతో నన్ను ఆమె మోసం చేసింది. మా ఇంటి నుంచి నగదుతో పాటు బంగారం తీసుకెళ్లింది. ఆమెతో పాటు ఆమె స్నేహితుల నుంచి నాకు ప్రాణ భయం ఉంది. నాకు న్యాయం చేయాలి. – రేవంత్, ఎన్టీపీసీ రామగుండం

యువతి కోసం గాలిస్తున్నాం

పెండ్లి చేసుకుని నగదు, బంగారు ఆభరణాలతో వెళ్లి ఫోన్ స్విచాఫ్ చేసిందని బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఆమె కోసం గాలిస్తున్నాం. చీటింగ్ కేసు నమోదు చేశాం. ఇటీవల హైదరాబాద్‌లో ఉందన్న సమాచారంతో వెళ్లినా ఆచూకీ దొరకలేదు. ఆమె పట్టుబడితే పూర్తి విషయాలు తెలిసే అవకాశాలున్నాయి. – బి.జీవన్, ఎస్సై, ఎన్టీపీసీ

బొలెరో క్యాంపర్ ఢీకొని గేదె మృతి

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా సోమవారం సాయంత్రం బొలెరో క్యాంపర్ వాహనం ఢీకొని రూ.లక్ష విలువైన గేదె మృతి చెందింది. ధర్మారం గ్రామానికి చెందిన పోలం రాజయ్య తన గేదెలను మేతకు తీసుకెళ్లి ఇంటికి వస్తుండగా, అతివేగంగా వచ్చిన వాహనం గేదెను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. కాగా తనకు పరిహారం చెల్లించాలని వాహన యాజమానిని రాజయ్య డిమాండ్ చేశాడు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

గోదావరిఖని(రామగుండం): స్థానిక అడ్డగుంటపల్లి సమీపంలోని రామాంజనేయ బార్ సమీపంలో బెంద్రం రాజిరెడ్డి, అతడి కుమారుడు కార్తీక్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ముగ్గురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ స్వామి తెలిపారు. స్థానిక ఇందిరానగర్‌కు చెందిన మేకల పోచం, సంపత్, అనిల్ దాడికి పాల్పడ్డారని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్ల రవాణా విషయంలో వాగ్వాదం జరిగి గొడవకు దారితీసినట్లు వివరించారు.

'వినాశకర విధానాలు అమలు చేస్తున్న ప్రభుత్వాలు'

గోదావరిఖని(రామగుండం): అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు వినాశకర విధానాలను అమలు చేస్తున్నాయని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జాతీయ సమావేశాలు ముగింపు సందర్భంగా మాట్లాడారు. దేశంలోని ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేట్ శక్తులకు అమ్మివేస్తూ సహజ వనరులను, దేశ సంపదను లూటీ చేస్తున్న అదానీ, అంబానీలాంటి బడా కుబేరులకు మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తుందన్నారు. దేశంలో ఆకలి, దరిద్రం, పేదరికం, పెరిగిపోతుందన్నారు. పరిశ్రమల ప్రైవేటీకరణ, లేబర్ చట్టాల రద్దు, ప్రజల నిరసనలపై తీవ్ర నిర్బంధం ద్వారా అణచివేత కొనసాగుతుందన్నారు. కార్మిక చట్టాల రక్షణకు ప్రజా కార్మిక ఐక్య ఉద్యమాలలో కార్మికవర్గం పాల్గొనాలని పిలుపునిచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జాతీయ నా యకులు ప్రదీప్, ప్రసాద్, కుల్వీందర్‌సింగ్, వీకే పటోలే, పోలారి, ఆర్.జనార్దన్, వెంకటేశ్వర్లు, ఆశిష్, రాజేష్, భారతి, అరుణ, ప్రతాప్, ఐ.కృష్ణ, ఎ.వెంకన్న, నరేష్, అశోక్, చిలుక శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

జాతీయ సంపదను దోచుకుంటున్న కార్పొరేట్ కంపెనీలు

జ్యోతినగర్(రామగుండం): కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరంచేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ అపర్ణ, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, జాతీయ ఉపాధ్యక్షుడు పుల్వేందర్ సింగ్ అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశ సంపదను విదేశీ కంపెనీలకు అప్పగించేందు కు జాతీయ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడాన్ని ఐ ఎఫ్‌టీయూ అడ్డుకుంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హక్కులను కాలరాస్తూ కార్మికులను కార్పొరేట్ కంపెనీలకు క ట్టు బానిసలుగా చేస్తున్నారని ఆరోపించారు. 44 కార్మిక చ ట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించడం కార్మిక హక్కుల ను హరించడమే అన్నారు. కార్మికుల హక్కులు సాధించుకునే ందుకు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పోరాట మార్గాల రూపకల్పన చేపట్టి దశలవారీగా ఉద్యమాలు చేయబోతున్నామని పేర్కొన్నా రు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకన్న, జిల్లా అధ్యక్షుడు ఈదునూరి నరేష్, ప్రధాన కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లింపునకు ఒప్పందం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికుడు సురేష్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లింపునకు ఒప్పందం కుదిరిందని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు తెలిపారు. వివరాలు.. టెక్నోకేర్ కాంట్రాక్టర్ వద్ద ఎన్టీపీసీ ఏహెచ్‌పీ బాటమ్ యాష్ స్టేజీ–2 ఏరియాలో ఆదివారం ఉదయం విధుల్లో ఉన్న సూపర్‌వైజర్ కోయా సురేష్‌బాబు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానిక కార్మికులు, కాంట్రాక్టర్ కరీంనగర్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. మృతుడి అంత్యక్రియలకు రూ.50 వేలు, నష్టపరిహారంగా రూ.10,50,000 చెల్లించడంతో పాటు మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు అంగీకారం తెలుపుతూ ఒప్పందం కుదిరింది. కార్యక్రమంలో నాయకులు కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, ఇజ్జగిరి భూమయ్య, లక్ష్మణ్, రాజమల్లయ్య, నాగభూషణం, శ్రీనివాస్,గీట్ల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రం అందిస్తున్న నాయకులు

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, కేంద్రం రూ.10లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య, కుమారస్వామి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలను కేటాయించాలన్నారు. నాయకులు ముత్యంరావు, మహేశ్వరి, గణేశ్, సాగర్, రవీందర్, అశోక్ పాల్గొన్నారు.

కారు బోల్తా.. యువకుడికి తీవ్రగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రామగుండం: గోదావరిఖని జవహర్‌నగర్‌కు చెందిన సామల అభినవ్‌తేజ రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలయ్యాడు. వివరాలు.. ఖమ్మం నుంచి కారులో ఒక్కడే డ్రైవ్ చేస్తూ గోదావరిఖని వస్తున్న క్రమంలో సోమవారం రాత్రి మల్యాలపల్లి సబ్‌స్టేషన్ ఏరియా రాజీవ్ రహదారి మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి, కరీంనగర్ వైపు వెళ్లు రహదారిపైకి ఎగిరిపడడంతో అభినవ్‌తేజ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. హెచ్‌కేఆర్ అంబులెన్స్ ఘటనాస్థలికి చేరుకోగా వైద్యుడు సంజీవ్ పర్యవేక్షణలో క్షతగాత్రుడిని గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్స్‌లో తరలించే సమయంలో అభినవ్‌తేజ స్పృహలో లేడని వైద్యుడు పేర్కొన్నాడు.

మల్లాపూర్ శివారులో గుర్తుతెలియని మృతదేహం

తిమ్మాపూర్: మండలంలోని మల్లాపూర్ శివారులో పర్లపల్లికి వెళ్లే మట్టి రోడ్డుకు సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఈమేకు ఎల్ఎండీ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయసు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. ఒంటిపై నలుపు రంగు షర్ట్, ఎడమ కాలుకు నల్లని దారం కట్టుకున్నాడు. మృతదేహం ఉబ్బిపోయి ఉంది. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధికులు 8712670770 నంబర్‌లో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

బొగ్గుబాయి వార్తలు

దుర్గామాతకు ఆషాఢమాస పూజలు



గోదావరిఖని(రామగుండం): స్థానిక సింగరేణి అధికారుల బంగ్లాస్ ఏరియాలోని దుర్గామాతా అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించారు. అధికారుల భార్యలు, లేడీస్ క్లబ్ సభ్యులు బోనాలు సమర్పించి చల్లగా చూడాలని వేడుకున్నారు. ఆర్జీ–1 అధ్యక్షురాలు చింతల లక్ష్మి, ఆర్జీ–2 సేవా అధ్యక్షురాలు సవిత, జయ, మాలతి, పద్మ, శ్రీదేవి, టీవీరావు, విజయ, లేడీస్ క్లబ్ సభ్యులు బీనాసింగ్, నీరజ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



పరిశుభ్రతలో రాజీలేకుండా ముందుకు సాగాలి

- ఆర్జీ–2 జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): పరిసరాల పరిశుభ్రతలో రాజీలేకుండా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ కోరారు. సోమవారం స్వచ్ఛపక్వాడా ముగింపు కార్యక్రమాన్ని జీఎం కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా పరిసరాల పరిశుభ్రతలో కీలకంగా వ్యవహరిస్తున్న సఫాయి కర్మచారి ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సఫాయి కర్మచారి ఉద్యోగుల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, పర్యావరణ అధికారి సురేష్‌బాబు, పర్సనల్ మేనేజర్ ఎస్.అనిల్‌కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణుగోపాల్, వంశీధర్, పర్సనల్ అధికారి మండల శ్రీనివాస్, సీనియర్ సెక్యూరిటీ అధికారి పీవీ రమణ, జీఎం ఆఫీస్ ఫిట్ సెక్రెటరీ చిప్ప సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జీఎం మనోహర్

జేఎన్‌టీయూ విద్యార్థులను అభినందించిన జీఎం

గోదావరిఖని(రామగుండం): మంథని జేఎన్‌టీయూ విద్యార్థులను ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్ సోమవారం అభినందించారు. ప్రశంసాపత్రాలను అందజేశారు. జీడీకే–7 ఎల్ఈపీ గనిని పర్యాటక కేంద్రంగా తయారు సమయంలో వీక్షకులు సందర్శనకు వచ్చినప్పుడు వారికి పూర్తి అవగాహన కల్పించి, భూగర్భ గని యొక్క నమునాను కళ్లకు కట్టినట్లు రెండు నమూనాలు వర్చువల్ కోల్ మైన్స్, షాఫ్ట్ వైడింగ్ సిస్టంను తయారు చేశారు. దీన్ని గుర్తించి జీఎం, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో జీఎం మనోహర్ తదితరులు

ఓపీసీ–3 ప్రాజెక్టు అధికారిగా రాజేందర్

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2 ప్రాజెక్టు అధికారిగా కె.రాజేందర్ సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పీవోగా విధులు నిర్వహించిన నరేందర్ బెల్లంపల్లి డివిజన్‌కు పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఇక్కడికి బదిలీపై వచ్చిన రాజేందర్ ప్రాజెక్టు అధికారిగా విధుల్లో చేరి ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు.



జీఎం సుధాకర్‌రావుతో రాజేందర్

బల్దియాకు చేరిన స్కైలిఫ్టర్, బాబ్‌కార్డ్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో వాహనాల కొనుగోలు, అక్రమాలపై విజిలెన్స్ అధికారుల దర్యాప్తు జరుగుతున్న నేపథ్యంలో.. రెండేళ్ల తర్వాత సుమారు రూ.30 లక్షల వ్యయం చేసే కొత్త స్కైలిఫ్టర్ వాహనంతోపాటు బాబ్‌కార్డ్ మిషన్ వాహనం సోమవారం బల్దియాకు చేరుకున్నాయి. వాహనాలు సరఫరా చేయడానికి టెండరు పొందిన ఓ ఏజెన్సీ ప్రతినిధులు ఈ వాహనాలను తీసుకొచ్చారని తెలిసింది. బల్దియా కార్యాలయం ఆవరణలో ఈ వాహనాలను పార్క్ చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.7కోట్ల వ్యయంతో బల్దియాలోని శానిటేషన్ విభాగానికి రెండేళ్ల క్రితం పలు వాహనాల కొనుగోలు చేయడానికి ఓ ఏజెన్సీకి టెండర్ అప్పగించారు. కొన్ని వాహనాలను సరఫరా చేసిన సదరు ఏజెన్సీ ఐదు వాహనాలతోపాటు 50 గార్బేజ్ బిన్స్‌ను సరఫరా చేయలేదు. వీటికి రూ.2.34కోట్ల వరకు సదరు ఏజెన్సీకి డబ్బులను కూడా బల్దియా చెల్లించింది. కానీ రెండేళ్లయినా వాహనాలను అందించక పోవడంపై అనుమానంతో పలువురు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై కాంగ్రెస్‌కు చెందిన కార్పొరేటర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు వరుసగా రెండేళ్లుగా కనిపించకుండా పోయిన వాహనాలు ఒక్కొక్కటిగా బల్దియాకు చేరుకున్నాయి. ఇంకా 50 గార్బేజ్ బిన్స్ బల్దియాకు రావాల్సి ఉంది.



స్కైలిఫ్టర్ వాహనం

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశానికి ఎంపిక పోటీలు

కమాన్‌పూర్(మంథని): హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు 5న మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో సంపత్‌రావు తెలిపారు. విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం 4వ తరగతి చదివేవారు 01.09.2014 నుంచి 31.08.2015 మధ్య, ఐదో తరగతి విద్యార్థులు 01.09.2013 నుంచి 31.08.2014 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్, స్టడీ సర్టిఫికెట్స్ తదితర ధ్రువపత్రాలతో హాజరుకావాలని, పూర్తి వివరాలకు పీఈటీ ప్రకాష్ 94924 62292 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

4న సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్(పెద్దపల్లి): 4న సుల్తానాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ సురేందర్ తెలిపారు. విద్యార్థులు ధ్రువపత్రాలతో ఉదయం 9.30 గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. పూర్తి వివరాలకు పీఈటీ దాసరి రమేష్‌ను 94906 74874 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ధర్మారంలో..

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండల విద్యావనరుల కేంద్రంలో 4న ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో చాయాదేవి తెలిపారు. విద్యార్థులు ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ మృతదేహం

పెద్దపల్లిరూరల్: బీటెక్ చదివిన తన కు ఉద్యోగం రావడంలేదన్న బెంగతో జిల్లా కేంద్రంలోని రంగంపల్లికి చెందిన మెంగని శ్రీకాంత్ (26) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. రంగంపల్లిలోని ఆదర్శనగర్‌లో నివాసముంటున్న శ్రీకాంత్ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగం కోసం తిరిగితిరిగి వేసారాడు. ఇక ఉద్యోగం రాదేమోనని మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.